విశాఖకు దీటుగా పాయకరావుపేట అభివృద్ధి

- రూ.400 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు
- హోం మంత్రి వంగలపూడి అనిత

విశాలాంధ్ర - పాయకరావుపేట: విశాఖకు దీటుగా పాయకరావుపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. పాయకరావుపేట పట్టణంలో టీడీపీ కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి అనిత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఏడాది కాలంలో పాయకరావుపేట నియోజక వర్గంలో రూ.400 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. పాయకరావుపేట చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 44 వేల ఓట్ల మెజార్టీతో గెలిపించారని, మంత్రి పదవి కూడా వచ్చేందుకు సహకరించారని అన్నారు. నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కు, స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కాబోతున్నాయని తెలిపారు. గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కు పాదం మోపుతామని తెలిపారు. పాయకరావుపేట మెయిన్ రోడ్డును రూ.4 కోట్లతో మరో నెల రోజుల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. పాయకరావుపేట పట్టణ చెందిన పంచాయితీ 3వ వార్డు సభ్యులు పింకే గోవిందు కుటుంబ సభ్యులతో కలిపి 150 మందితో మంత్రి వంగల పూడి అనిత సమక్షంలో టీడీపీలో చేరారు. అనంతరం మండలంలోని నామవరం గ్రామంలో మంత్రి అనిత ప్రజలతో ముఖా ముఖి నిర్వహి ంచారు. మంత్రి అనిత మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గ్రామాలు ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో గ్రామాలు అన్ని విధాల అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. జల్లూరు, వందూరు బ్రిడ్జిలు పూర్తి కానున్నట్లు తెలిపారు. పాయకరావుపేటలో రూ. 60 లక్షలతో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రి 100 పడకల ఆసుపత్రిగా త్వరలోనే అభివృద్ధి చేస్తామ న్నారు. నామవరం గెడ్డకాలువను శుభ్రం చేయిం చాలని అధికారులను మంత్రి అనిత ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గెద్దం బుజ్జి, తోట నగేష్, బోడపాటి శివదత్, టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, మండల అధ్యక్షులు చించలపు ప్రదీప్, పట్టణ అధ్యక్షులు యాళ్ల వరహాల బాబు, కంకిపాటి వెంకటేశ్వరరావు, బొంది కాశీ విశ్వనాథ్, చిక్కాల శ్రీను, గూటూరు శ్రీనివాసరావు, చింతకాయల రాంబాబు, మజ్జూరి నారాయణ రావు, వంకా రమణ, మల్లపురెడ్డి రమాకుమారి, జూరెడ్డి ప్రసాద్, పల్లా విలియం కేరి, కట్టా శ్రీను, కురందాసు శివ, గొర్ల లక్ష్మీనారాయణ, రాజాన ఆది, గంపల చినరాజు, ఏడిద సురేష్, ముంజులూరి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏరువాక ప్రారంభించిన ఎమ్మెల్యే రాజు

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం మండలం లక్ష్మీపురం గ్రామంలో ఏరువాక కార్యక్రమంను స్థానిక ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు బుధవారం ప్రారంభించారు. రైతన్నలు, మహిళలు వెంటరాగా ముందుగా భూలక్ష్మికి, పశువులకు పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు జరిపి ఏరు పూని దుక్కి దున్ని, విత్తనాలు జల్లి 2025-26 ఖరీఫ్ సీజన్ అధికారికంగా ప్రారంభం చేశారు. గ్రామస్తుల వినతుల మేరకు లక్ష్మీపురం నుండి బి.ఎన్.రోడ్డు వరకు రహదారి ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేయవలసిందిగా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు అధ్యక్షుడు, గోవాడ సుగర్స్ మాజీ చైర్మన్ గూనూరు మల్లునాయుడు, జనసేన నేత సిరపురపు రమేష్, టి.డి.పి. మండల పార్టీ అధ్యక్షుడు కనిశెట్టి మత్స్యరాజు, సకురు కోటేశ్వరరావు, చోడవరం వైస్ ఎంపీపీ భూతనాథ్ నానీ కుమార్, పిఎసిఎస్ అధ్యక్షుడు బి.లక్ష్మణరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారానికే జనవాణి

విశాలాంధ్ర - అచ్యుతాపురం: ప్రజల సమస్యలు పరిష్కారానికి జనవాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. బుధవారం వెంకటాపురం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అచ్యుతాపురం మండలంలో ప్రజల సమస్యలపై ఫిర్యాదులను ఎమ్మెల్యే స్వీకరించారు. ఎమ్మెల్యే ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించి సంబంధిత అధికారులతో చర్చించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి జనపరెడ్డి శ్రీనివాసరావు, కూటమి నాయకులు బైలపూడి శ్రీరామదాసు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కూటమితోనే రాష్ట్రం అభివృద్ధి

విశాలాంధ్ర - యలమంచిలి: రాష్ట్రం అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీలోని పివి కాంప్లెక్స్‌లో లారెన్స్ కంపెనీ మంజూరు చేసిన 17.50 లక్షల సిఎస్ఆర్ నిధులతో తులసి నగర్, పాత వీధి సచివాలయ భవనాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ రాజు, జనసేన పార్టీ నాయకులు పుటకూటి రమేష్, కొటారు శ్రీనివాసరావు, లవ్వ లోవరాజు పాల్గొన్నారు.

జనసేన మండల కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర - పరవాడ: జనసేన పార్టీ మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జనసేన మండల పార్టీ అధ్యక్షుడు బొద్దపు శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విశాఖ రూరల్ జిల్లా అధ్యక్షుడు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ఆదేశాల మేరకు ఈ ఎన్నిక జరిగినట్లు పేర్కొన్నారు. పార్టీ మండల ఉపాధ్యక్షులుగా వర్రి పరదేశి నాయుడు, వెన్నెల నరసింహారావు, ప్రధాన కార్యదర్శిగా కరణం నర్సింగరావు ఎన్నిక కాగా అధికార ప్రతినిధిగా బందారు రాజు, కార్యదర్శులుగా మడక రమణ, పైల దినేష్, గొంతిన రాము, పంది రాజు, ఇందల అశోక్, సంయుక్త కార్యదర్శులుగా మోటూరు హరి, రావాడ శివ, కోరుకొండ శ్రీను, దూడ మసేను ఎన్నికైనట్లు చెప్పారు.

శాప్ చైర్మన్ రవి నాయుడును కలిసిన బుచ్చిరాజు

విశాలాంధ్ర-సబ్బవరం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాప్ బోర్డు డైరెక్టర్‌గా నియమితులైన జిల్లా టిడిపి తెలుగు యువత అధ్యక్షులు పీ బి వి ఎస్ ఎన్ రాజు (బుచ్చిరాజు)శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు ను మర్యాద పూర్వకంగా బుధవారం కలిసి శాప్ డైరెక్టర్ గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాజు రవినాయుడు కు దుస్సలువా కప్పి సత్కరించారు. బుచ్చిరాజుతో పాటు సబ్బవరం మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కోరాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజానాట్యమండలి జిల్లా ప్రథమ మహాసభను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - అనకాపల్లి: ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా ప్రథమ మహాసభ ఈనెల 25వ తేదీన కోడిగంటి గోవిందరావు భవన్‌లోని విజయ్‌కుమార్ హాలులో జరుగుతుందని గొర్లె దేముడు బాబు, కొండూరు వీరాచారి, రాజాన దొరబాబు, వియ్యపు రాజు, కోరుబిల్లి శంకర్రావు తెలిపారు. సీపీఐ కార్యాలయంలో బుధవారం కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పీడిత ప్రజల గొంతుక పాలక పక్షాలకు అది ఒక దీటైన ప్రతిపక్షం అన్నారు. సుంకర నారాయణ, సుద్దాల హనుమంతు, తిరునగరి రామాంజనేయులు, బొల్లి ముంత శివరామకృష్ణ, అల్లు రామలింగయ్య, గుమ్మడి, మిక్కిలినేని, నాగభూషణం, టి.చలపతిరావు, కె.ఎస్.రామారావు, గరికపాటి రాజారావు, వల్లం నరసింహారావు, మాదాల రంగారావు, పెరుమాళ్ళు, తాపీ రాజమ్మ, మోటూరి ఉదయం, జమున ఇలా ఎంతోమంది తమ జీవితాలను ప్రజానాట్యమండలికి అంకితం చేశారన్నారు. కార్పొరేట్ సంస్కృతికి ప్రత్యామ్నాయంగా ప్రజా కళలను తీర్చిదిద్దుకోవాల్సిన తక్షణ అవసరం మన ముందున్నది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా ప్రథమ మహాసభను నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో విత్తనాల పోతురాజు, ముత్తూరి సూరిబాబు, జీవి రావు తదితరులు పాల్గొన్నారు.

లారస్ ఫార్మా కంపెనీ బస్సు దగ్ధం

విశాలాంధ్ర - అనకాపల్లి: అనకాపల్లి నుంచి చోడవరం వైపు వెళ్తున్న లారెస్ ఫార్మా కంపెనీ బస్సులో బవులువాడ దగ్గర ఆకస్మికంగా మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయింది. బస్సులో కార్మికులు ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. డ్రైవర్ గమనించి బస్సు నుండి బయటకు వచ్చేయడంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. బస్సులో చెలరేగిన మంటలకు పైనున్న ఎలక్ట్రికల్ లైన్స్ సైతం కాలితెగిపోయాయి. ఇలాగే కొద్దిరోజుల క్రితం ఎలమంచిలి వద్ద బ్రాండిక్స్ కంపెనీ బస్సు ప్రమాదానికి గురైంది. కార్మికులు పదుల సంఖ్యలో గాయల పాలయ్యారు. అనకాపల్లి జిల్లా తీర ప్రాంతంలో అచ్యుతాపురం, లంకెలపాలెం, నక్కపల్లి, పరవాడ ప్రాంతాల్లో వందలాది బడా ఫార్మా, కెమికల్, గార్మెంట్ కంపెనీల వేలాది మంది కార్మికులు ఇలాంటి బస్సుల్లోనే నిత్యం విధులకు పరిశ్రమల యాజమాన్యాలు కార్మికులను తరలిస్తున్నాయి. ప్రతి ఏడాది ఇలాంటి ప్రమాదాలు ఫార్మా, బ్రాండిక్స్ కంపెనీల బస్సులలో ఏదో ఒకచోట జరుగు తూనే ఉన్నాయి. అయినప్పటికీ యాజమా న్యాలపై బస్సుల కాంట్రాక్టర్లపై ప్రభుత్వ అధికారులు, పరిశ్రమల అధికారులు, రవాణా శాఖ తగిన చర్యలు తీసుకోవట్లేదు. అందువల్లే ప్రమాదాలు పునరావృతం అవుతున్నాయి. కావున తక్షణమే కార్మికులను తరలించే అన్ని కంపెనీల బస్సులకు ఫిట్నెస్, ఇతర భద్రతా పరమైన చర్యలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతు కూలీసంఘం (ఆంధ్రప్రదేశ్) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది.

ఏరువాకలో తలపాగా కట్టిన ఎమ్మెల్యే సుందరపు

విశాలాంధ్ర - రాంబిల్లి: ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన బుధవారం మండలంలో పంచదార్ల గ్రామంలో పొలానికి వెళ్లి ఎడ్లకు పూజలు చేసి పొలం దున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది సిరులు పండించాలని కోరుకుంటూ అన్నదాతల ఏరువాక పండుగలో భాగమయ్యానని అందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. రైతులకు రాయితీపై విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారులు సి.హెచ్.సుమంత, మోహన్‌రావు, మండల టిడిపి అధ్యక్షులు వసంతవాడ దిన్ బాబు, వ్యవసాయ సిబ్బంది దేముడు, రైతులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: అనిత

విశాలాంధ్ర - యస్.రాయవరం: రైతు సంక్షేమం ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. బుధవారం మండలంలో గెడ్డపాలెం జంక్షన్ వద్ద ఏరువాక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వము రైతుల విషయంలో అధిక ప్రాధాన్యత ఇస్తుందని అదే విధంగా రాయితీపై వ్యవసాయ పనిముట్లు డ్రోన్లు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఇన్‌చార్జ్ ఏడిఏ ఉమా ప్రసాద్, తహసిల్దార్ జె.రమేష్ బాబు, మండల వ్యవసాయ శాఖ అధికారి సౌజన్య, టిడిపి నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ ,మాజీ ఎంపీపీ వై .వినోద్ రాజు, మండల టీడీపీ అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, సీనియర్ నాయకులు దండు అచ్యుతరామరాజు, ఎన్.వెంకటరాజు గుర్రం రామకృష్ణ, కురందాసు నూకరాజు, గింజల లక్ష్మణరావు, తన్నీరు ఎరకయ్య, అల్లు నరసింహమూర్తి, వంగలపూడి గోవిందు, కోన అప్పలరాజు, సమ్మెంగి నానాజీ, టిడిపి, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏరువాకలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ



విశాలాంధ్ర - కశింకోట: ఏరువాక కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని సోమవరం గ్రామంలో పల్లె నిద్రలో భాగంగా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఎడ్లకు పూజ చేసి నాగలితో పొలం దున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొంతిన శ్రీని వాసరావుతో కలిసి కొణతాల మాట్లాడారు. ప్రతీ సంవత్సరం జ్యేష్ఠ పూర్ణిమనాడు ఏరువాక పున్నమినీ రైతులందరూ జరుపుకొంటారని తెలిపారు. అనంతరం ఉత్తమ రైతులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కశింకోట మండల జనసేన పార్టీ ఇన్చార్జి బిమరశెట్టి చిన్ని కృష్ణ(చిన్ని), జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన రావు, డి.అర్.సి ఎడి శ్రీధర్, సుబ్రమణ్యం, అనకాపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు సరితా, శిరీష,బి.సి.టీ కే.వీ.కే కోఆర్డినేటర్ శైలజా, శాస్త్రవేత్తలు విజయ్ రాగిణి,శ్రీహరి, అనకాపల్లి పశుసంవర్ధక శాఖ సహాయ సంచలకులు సౌజన్య, పశు వైద్యులు ఆల్ఫన్ జార్జ్, మండల వ్యవసాయ శాఖ అధికారి స్వప్న పాల్గొన్నారు.

నేటి నుండి మోగనున్న బడి గంట

- తల్లిదండ్రుల్లో ఫీజుల టెన్షన్
- కార్పొరేట్ పాఠశాలలో పెరిగిన ఫీజులు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ఏప్రిల్ 23 నుండి పాఠశాలలకు వేసవి సెలవులు అనంతరం నేటి నుండి పాఠశాలలకు బడిగంట మోగనున్నది. ఇప్పటికే దీనికి సంబంధించి అన్ని ప్రభుత్వ పాఠశాల తరగతి గదుల్లో సదు పాయాలు, మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పిస్తున్నామని ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని విద్యా శాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే బియ్యం, పప్పులు, కూరగాయలు నిత్యవసర వస్తువులతో పాటు ప్రతి వ్యక్తిపై మోయలేని ఆర్థిక భారం పడుతుంది. ప్రస్తుతం మధ్యతరగతి కుటుంబం వారు జూన్ నెలలో పాఠశాలలు తెరుస్తున్నారంటే ఒక రకమైన భయానికి గురవుతున్నారు. కారణం ఏమిటంటే పాఠశాలల ఫీజులు, బ్యాగులు, పుస్తకాలు, నోట్ బుక్స్, ట్రావెలింగ్ తదితరాలన్నీ ఒక్కసారిగా ఆర్థిక భారం పడుతుంది. దీంతో వీరంతా మల్ల గుల్లాలు పడుతున్నారు. కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు చుక్కలు అంటుకుం టున్నాయి. సౌకర్యాలు మాట ఎలా ఉన్నా ఫీజులు మాత్రం ఘనంగా ఉన్నాయి. సాధారణ ప్రైవేటు పాఠశాలలో ప్రాథమిక తరగతులకు కనీసం 25 వేల నుండి 30,000, ఉన్నత పాఠశాలలకు 30 వేల నుండి సుమారు 40, 45,000 వరకు వసూలు చేస్తున్నారు. కార్పొరేట్ పాఠశాలల విషయానికి వస్తే మధ్యతరగతి కుటుంబం ఎవరూ కూడా వాటి జోలికి వెళ్లే ప్రసక్తే లేకుండా పోతుంది. ఒకటి నుండి ఐదు తరగతుల వరకు సుమారు 50,000 పై మాటే. 5 నుండి 10 వరకు సుమారు లక్ష రూపాయలు వరకు ఖర్చు పెట్టే పరిస్థితి ఏర్పడుతుంది. వీరికి ఫీజుల విషయంలో ఎవరు అడ్డుపెట్టే పరిస్థితి లేకుండా పోయింది. ఇక పాఠ్య పుస్తకాలు విషయానికి వస్తే పాఠశాలలు మొదలు పెట్టగానే ప్రతి ఒక్కరూ ముందుగా పుస్తకాలు కొనుగోలు చేస్తుంటారు. సాధారణ ప్రైవేటు పాఠశాలల్లో ఐదవ తరగతి వరకు పాఠ్యపుస్తకాలు నోట్ బుక్స్‌తో కలిపి సుమారు 5,000 వరకు ఖర్చు కాగా కార్పొరేట్ విద్యాసంస్థల్లో సుమారు 8,000 నుండి 9,000 వరకు వెచ్చించాల్సి వస్తుంది. ఒక్కొక్క పాఠశాల ఒక్కొక్క రకమైన ధరలతో తల్లిదండ్రులకు పుస్తకాల విషయంలో కూడా చుక్కలు చూపుతున్నారు. వీటితోపాటు ఒక్కో పాఠశాల ఒక్కో రకమైన యూనిఫామ్ రూపొందించి వాటిని కూడా పాఠశాలల్లోనే కొనుగోలు చేయాలని నిబంధన పెట్టి మరి వాటిని విక్రయిస్తున్నారు. వీటితోపాటు బూట్లు, టై, ఐడెంటి కార్డు తదితర అనేక సాకులు చూపి మరి విద్యార్థుల తల్లిదండ్రుల నుండి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా కార్పొరేట్ విద్యాసంస్థలు వారి అడ్మిషన్ల కోసం ఏకంగా పిఆర్‌ఓలనే రంగంలోకి దించేస్తున్నాయి. మరికొంతమంది యాజమాన్యాలు అయితే నేరుగా తల్లిదండ్రులకే ఫోన్లు చేసి మరీ అడ్మిషన్లు అడుగుతున్నారు. ఏది ఏమైనప్పటికీ పిల్లల చదువు కోసం తల్లిదండ్రులు ప్రాధాన్యత ఇచ్చి తమ కన్నా వారు బాగుండాలన్న ఆలోచనతో ఆర్థికంగా భారమైన భరించి రెక్కల కష్టంతో చదివిస్తున్నారు. పేదవారైతే అవసరమైతే అప్పులు చేసేందుకు కూడా వెనకాడటం లేదు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు ఏమైనా వస్తే వీరికి కొంత ఉపశమనం కలిగే పరిస్థితి ఏర్పడుతుందని తల్లిదండ్రులు చెబుతున్నారు.

జాతీయ స్థాయి ఎన్‌పిటిఈఎల్ పరీక్షల్లో సీతం అధ్యాపకుడు మధుబాబు ప్రతిభ

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ఐఐటి మద్రాస్ వారు నిర్వహించిన జాతి స్థాయి ఎన్‌పిటిఈఎల్ ఆన్‌లైన్ సర్టిఫికేషన్ పరీక్షల్లో సత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్-ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ డాటా సైన్స్ డిపార్ట్మెంట్ చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ మొగలి మధుబాబు ఉత్తీర్ణత సాధించారు. దానితోపాటు ఐఓటీ సబ్జెక్టులో 88% మార్కులు, సిల్వర్ ప్రశంసా పత్రం పొందారు. దీనికి ఎన్‌పిటిఈఎల్ "స్టార్ బిలీవర్ "ప్రశంసా పత్రం పొందారు. అలాగే జూలై ఆరో తేదీన ఐఐటి మద్రాస్‌లో జరగబోయే ఒక్కరోజు ఐఐటి స్టార్ బిలీవర్స్ వర్క్ షాప్‌కి ఆహ్వానించబడినందుకు కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామమూర్తి, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు అభినందించి భవిష్యత్తులో ఇంకా ఎన్నో విజయాలు సాధించి ఎంతో ఉన్నత స్థాయిలో ఉండాలని ఆకాంక్షించారు.

డెంకాడలో సెంట్రల్ లైబ్రరీ ప్రారంభం

విశాలాంధ్ర - డెంకాడ: విజయనగరం జిల్లా డెంకాడ మండలం డెంకాడ గ్రామంలో బుధవారం నూతనంగా నిర్మించిన సెంట్రల్ లైబ్రరీను నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, స్థానిక ప్రజా ప్రతి నిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా లోకం మాధవి మాట్లాడుతూ గ్రామీణ యువతను చదువులో ముం దుకు నడిపించే సాధనాలు లైబ్రరీలు అని, డెంకాడలో ఇలాంటి విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయడం గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్వో పద్మావతి, ఎంపీడీవో వై.భవాని, ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, టీడీపీ నాయకులు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు, పల్లె భాస్కర రావు, పాణి రాజు, జనసేన నాయకులు చింతపల్లి రామ్మూర్తి, సిరికి అప్పారావు, రొంగల వెంకట్రావు, రమణ, కనకసింహాచలం పాల్గొన్నారు.

గుర్లలో అభివృద్ధి పనులు ప్రారంభం

విశాలాంధ్ర - గుర్ల: మండలంలో గుర్ల, వల్లాపురం, శేషపుపేట గ్రామంలో బుధవారం పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు ప్రారంభించారు. 4.95 లక్షల వ్యయంతో నిర్మించనున్న కళా వేదికకు శంకు స్థాపన, సి.సి. రోడ్డు, సి.సి. కాలువ పనులు, పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గ్రామ సభల్లో ఆమోదించిన పనులకు శంకుస్థాపన తదితర పనులు ప్రారంభించారు. కస్తూరిబా గాంధీ బాలికా ఆఫ్ గ్రేడ్ జూనియర్ కళాశాలకు శంకుస్థాపన చేశారు. ఏరువాక కార్యక్రమంలో పాల్గొని రైతులకు విత్తనాలు, డ్రోన్లు పంపిణీ చేశారు. వల్లాపురంలో సచివాలయం, రైతు సేవ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పొట్నూరు ప్రమీల, జెడ్పీటీసీ శీర అప్పల నాయుడు, బీసీ సెల్ ఆర్గనైజర్ సెక్రటరీ సన్యాసి నాయుడు, కిరణ్ బాబు, మండల పార్టీ అధ్యక్షులు సి.హెచ్.మహేశ్వరరావు,కిలారి సూర్య నారాయణ, ఎంపీడీవో శేషు బాబు, తహశీల్దార్ ఆదిలక్ష్మి, వ్యవ సాయ అధికారి తిరుపతిరావు పాల్గొన్నారు.

కూటమి హయాంలోనే గ్రామాలు అభివృద్ధి

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్: మండలంలోని ధర్మవరం గ్రామంలో 19 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించే కొత్త సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి శంకుస్థాపన చేశారు. ఈ రోడ్డు మారుతీ నగర్ నుండి కృష్ణాపురం వరకు అభివృద్ధిని తీసుకువస్తుంది అని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

డిప్యూటీ తహశీల్దారుగా కె.రామకృష్ణ

విశాలాంధ్ర - వేపాడ: వేపాడ మండల తహశీల్దార్ కార్యాలయం డిప్యూటీ తహశీల్దార్‌గా కె.రామకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేసిన కే.సన్యాసినాయుడు బదిలీపై మన్యం జిల్లా వెళ్లారు. కాగా రామకృష్ణ గతంలో ఇక్కడ డిప్యూటీ తహశీల్ధారుగా విధులు నిర్వహిస్తూ బదిలీపై సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్‌గా లక్కవరపుకోట మండలం వెళ్లి మరల వేపాడ డి.టిగా బాధ్యతలు స్వీకరించడం మండలంలో అందరికీ సుపరిచితుడుగా పరిచయాలు ఉండడంతో మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చీపురుపల్లి తహశీల్దారుగా ధర్మరాజు

విశాలాంధ్ర - చీపురుపల్లి: చీపురుపల్లి మండలం నూతన తహశీల్దార్‌గా డి.ధర్మరాజు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఎస్.రాజారావు బదిలీపై డెంకాడ మండలానికి వెళ్లిపోగా ఆయన స్థానంలో వంగర మండలం నుండి చీపురుపల్లికి బదిలీపై తహశీల్దార్‌గా డి.ధర్మరాజు బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఎస్‌డీటీ కే.సూర్యకాంతం, సీనియర్ అసిస్టెంట్ మూర్తి, ఆర్ఐ డి.రామ్ కుమార్, సర్వేయర్ శ్రీనివాసరావు తహశీల్దార్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

కొత్త రోడ్లును ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - పూసపాటిరేగ: మండలంలో కస్తూరిబా పాఠశాలలో అదనపు గదులు నిర్మాణానికి బుధవారం నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే లోకం నాగ మాధవి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్డీఏ కూటమిలో ప్రతి నియోజకవర్గ అభివృద్ధి చెందుతుందని, అభివృద్ధిలో భాగంగా పాఠశాల అదనపు గదులు నిర్మాణం కొరకు శంకుస్థాపన చేసి త్వరితగతిన పూర్తి చేస్తామని ఆమె అన్నారు. అనంతరం గొల్లపేట మహిళలు మంచినీటికి చాలా ఇబ్బందికరంగా ఉందని తెలియజేయడంతో వెంటనే ఆ సమస్యను గుర్తించి తగు చర్య తీసుకుంటానని చెప్పారు. గోవిందపురంలో కొత్తగా నిర్మించిన సిసి రోడ్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన నాయకులు, మండల అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి కైవసం చేసుకున్న బేబి నాయన

విశాలాంధ్ర - బొబ్బిలి: మున్సిపల్ కౌన్సిల్ హాలులో వైస్-చైర్మన్ గొలగాని రమాదేవిపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.. ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి ఆర్డీవో జే.వి.ఎస్.ఎస్. రామ్మోహన్‌రావు సమక్షంలో 21 మంది కౌన్సిలర్లు, ఎక్స్‌అఫీషియో మెంబర్, ఎమ్మెల్యే బేబీనాయనతో కలిపి 22 ఓట్లతో ప్రస్తుత వైస్-చైర్మన్ గొలగాని రమాదేవిపై అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లు ప్రకటించారు. పురపాలక సంఘంలో కూటమి ప్రభుత్వం ఎమ్మెల్యే బేబి నాయన నాయకత్వంలో పురపాలక సంఘంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను కూటమి ప్రభుత్వం కైవసం చేసుకుంది.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు: మంత్రి కొండపల్లి

విశాలాంధ్ర - దత్తిరాజేరు: తమ ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళు లాంటివని రాష్ట్ర ఎంఎస్ఎమ్ఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. బొండపల్లి మండలం దేవుపల్లి, దత్తిరాజేరు మండల కేజీబీవీల్లో ఒక్కోచోట రూ.2.12 కోట్ల సమగ్ర శిక్ష నిధులతో కల్పించనున్న అదనపు వసతులకు బుధవారం మంత్రి కొండపల్లి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయా పాఠశాలలను పరిశీలించారు. అక్కడి ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇచ్చిన హామీల్లో చాలా వరకు ఈ ఏడాదిలోనే అమలు చేశామని చెప్పారు. అలాగే అసలైన అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపించామన్నారు. ఒక్క గజపతినగరం నియోజకవర్గంలోనే ఈ ఏడాదిలో సుమారు రూ.100 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. వీటిలో ఇప్పటికే రూ.50 కోట్లు విలువైన పనులు ప్రగతిలో ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో సమగ్ర శిక్ష ఎపిసి డాక్టర్ ఎ.రామారావు, గజపతినగరం ఏఎంసి ఛైర్మన్ పివివి గోపాలరాజు, బొండపల్లి ఎంపిపి చల్లంనాయుడు, వైస్ ఎంపిపి బొడ్డు రాము, రెండు మండలాల తాహసీల్దార్లు డి.రాజేశ్వర్రావు, విజయకుమార్, ఎంపీడీఓలు గిరిబాల, వైవీ రాజేంద్రప్రసాద్, దేవుపల్లి సర్పంచ్ చంద్రకళ, కెజిబివి ప్రిన్సిపాళ్లు చంద్రకళ, శివపద్మ, ఇతర అధికారులు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

మునగపాకలో ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర-మునగపాక:మండల కేంద్రమైన మునగపాక పంచాయతీ కార్యాలయంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ సూచనల మేరకు శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి శిబిరం బుధవారం నిర్వహించారు.వైద్యులు ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించారు.అనంతరం వారికి ఉచితంగా మందులు అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు టెక్కలి పరశురాం,ఎంపీపీ మల్ల జయలక్ష్మి,గ్రామ సర్పంచ్ అప్పారావు,మొల్లేటి ఆనంద్,మునగపాక జనసేన పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు సూరిశెట్టి అప్పలనాయుడు,బీలా లక్ష్మణరావు,కారుకొండ కాశీ,ఎలక రవి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సిసి యువశక్తి క్యాంపునకు విజిటింగ్ ఆఫీసర్ సందర్శన

విశాలాంధ్ర- సబ్బవరం: దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం లో 13 ఆంధ్ర బెటలియన్ ఆధ్వర్యం లో జరుగుతున్న వార్షిక శిక్షణా శిబిరం ఎన్ సి సి 10 రోజులు యువశక్తి క్యాంపు లో భాగంగా బుధవారం ఆంధ్ర ఇంజనీరింగ్ బెటాలియన్, తిరుపతి నుండి విజిటింగ్ ఆఫీసర్ గా లెఫ్టినెంట్ కల్నల్ కె. శ్రీనివాసులు క్యాంపు ను సందర్శించి కాడేట్స్ దగ్గర నుండి గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం క్యాంపు కమాన్డెంట్ లెఫ్టినెంట్ కల్నల్ స్వర్నిమ్ ప్రభాత్ తో కలసి క్యాంపు పరిసరాలను, క్వార్టర్ గార్డ్,ట్రయినింగ్ ఏరియా, కుక్ హౌస్, వసతి, ఫైరింగ్ ఏరియా అన్నింటిని పరిశీలించి క్యాంపు చక్కగా నిర్వహిస్తున్నందుకు అభినంది%శీ%చారు. ఈ సందర్భముగా కాడేట్స్ తో సంభాషించి వారికి ఇస్తున్న ట్రయినింగ్, వసతి, మెస్ గురించి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో సుభేదార్ మేజర్ శ్రీనివాసరావు, ఎన్ సి సి అధికారులు,ఎన్ సి సి క్యాడెట్స్, పిఐ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత టైలరింగ్ శిక్షణకు దరఖాస్తులు

విశాలాంధ్ర -సబ్బవరం :మండల కేంద్రంలోని స్థానిక మదర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత టైలరింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ వి. సత్య గంగరాజు ఒక ప్రకటనలో తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా మదర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వందలాది మంది మహిళలకు టైలరింగ్ శిక్షణ అందించి ఉపాధి అవకాశాలను కల్పించారని అన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు బ్యాంక్ ఆఫ్ ఇండియా మేడ పైన గల మదర్ చారిబుల్ ట్రస్ట్ కార్యాలయంలో పనివేళలో ఫోన్ నెంబర్ 9966699633 సంప్రదించాలని అన్నారు.

అమరావతి మహిళలపై అసభ్య వ్యాఖ్యలు చేసిన వారిని శిక్షించాలి

విశాలాంధ్ర-మునగపాక:రాజధాని అమరావతి మహిళలపై అసభ్య వ్యాఖ్యలు చేసిన వారితోపాటు వాటిని ప్రసారం చేసిన సాక్షి మీడియాపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు డిమాండ్ చేశారు.తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు మండలంలో తిమ్మరాజుపేట గ్రామంలో జిల్లా తెలుగు మహిళ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.దీనిలో భాగంగా మెయిన్ రోడ్డులో గల మరిడిమాంబ ఆలయం నుంచి తిమ్మరాజుపేట జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేశారు.ఈ సందర్భంగా మంజు మాట్లాడుతూ మాజీ సీఎం,వైసీపీ అధినేత జగన్ ప్రమేయంతోనే మహిళలపై ఇటువంటి దాడులు జరుగుతున్నాయని,కావున తక్షణమే జగన్ రాష్ట్ర మహిళలకు క్షమాపణలు చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పోరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు,తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కడియం అనూరాధ,జిల్లా ఉపాధ్యక్షురాలు రేబాక మాలతి,పెంటకోట స్వాతి,నారాయణమ్మ,శరగడం ఈశ్వరమ్మ,అంబిక తదితరులు పాల్గొన్నారు.

శివాలయం నిర్మాణానికి రూ. 85,116 విరాళం

విశాలాంధ్ర -సబ్బవరం: మండల కేంద్రంలో స్థానిక శివాలయం నిర్మాణానికి సబ్బవరం మేజర్ పంచాయతీ,గొర్లివానిపాలెం గ్రామానికి చెందిన శ్రీ సూర్య మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్ యజమాని బాదిరెడ్డి లక్ష్మణ రూ.85,116 విరాళం ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దంగేటి నాగేశ్వరరావు, ప్రకాశ్, గెద్దం కృష్ణ, దెద్దం ప్రసాదరావు, కొల్లి కృష్ణ, బర్ల రమణ, పల్ల తాతారావు, కోన సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసాలు

విశాలాంధ్ర - పాయకరావుపేట: దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని కుమారపురం గ్రామంలో సామూహిక అక్షరాభ్యాసాల కార్యక్రమం నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాలలో ధార్మిక సేవా కార్యక్రమాల్లో భాగంగా సుమారు 6000 మందికి అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా కుమారపురం గ్రామంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో 40 మంది చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించినట్లు ట్రస్ట్ వితరణ సభ్యులు నీలాపు గోవింద్ రెడ్డి తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని వెంకటనగరం గ్రామానికి చెందిన పెద్దకావు శ్రీను కుటుంబానికి రూ. 2.44 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు చించలపు ప్రదీప్, పట్టణ అధ్యక్షులు యాళ్ల వరహాల బాబు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంకిపాటి వెంకటేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి బొంది కాశీ విశ్వనాథ్, వంకా సత్యనారాయణ, వంకా శివకుమార్, వంకా గోపి, వంకా హరి, గోవిందు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట: మండలంలోని రాజాం నుండి తురకలపూడి వరకు గల సుమారు ఐదు కిలోమీటర్ల రహదారి వాణిజ్య కేంద్రమైన అనకాపల్లికి ప్రధాన రహదారి కావడం నిత్యం ఇదే రహదారి ద్వారా వందలాది వాహనాలు ప్రయాణిస్తూ గోతులు మయంగా మారి రోడ్డు పూర్తిగా ధ్వంసం కాగా చినుకు పడితే గోతుల్లో నీరు చేరి ప్రయాణం నరకప్రాయంగా ఉన్న నేపథ్యంలో ఇదే రహదారి ద్వారా ప్రయాణిస్తున్న గర్భిణీలు, వృద్ధులు, రోగులు పడుతున్న అవస్థలను చూసి తురకలపూడి గ్రామ మాజీ వైస్ సర్పంచ్ ఉలింగ రాజారావు ఈ రోడ్డుకు మరమ్మత్తులు చేయించాలని పారిశ్రామికవేత్త చంద్ర ప్రభు కు చేసిన విజ్ఞప్తి మేరకు గొంప గ్రామానికి చెందిన నటరాజన్ జీడిపప్పు ఫ్యాక్టరీ యజమాని చంద్ర ప్రభు ఆర్థిక సహకారంతో బుధవారం రోడ్ల మరమ్మత్తు చేపట్టారు. రోడ్ల మరమ్మతుకు సహకరించిన చంద్ర ప్రభును పలువురు అభినందించారు.



రైతులు పాలిట శాపంగా మారిన కూటమి సర్కార్

విశాలాంధ్ర-మునగపాక:రైతులు పాలిట శాపంగా కూటమి ప్రభుత్వం మారిందని ఈ ప్రభుత్వం పెత్తందారుల ప్రభుత్వమని పేదల ప్రభుత్వం కాదని అరకు పార్లమెంట్ నియోజకవర్గ వైసీపీ పరిశీలకులు బొడ్డేడ ప్రసాద్ అన్నారు.మండలంలో వాడ్రాపల్లి గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు.ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ప్రసాద్ మాట్లాడుతూ అకాల వర్షాలకు దెబ్బతిన్న ధాన్యానికి కనీస గిట్టుబాటు ధర అందించాలన్నారు.అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసిపోయి,ఆర్థికంగా చితికిపోయిన రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని,వ్యవసాయ ప్రధానమైన ఆంధ్రప్రదేశ్ లో ఇటువంటి రైతు వ్యతిరేక విధానాల ధోరణిని తక్షణమే మార్చుకోవాలన్నారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఒకవైపు పండించిన పంటలకు మద్దతు ధరలు కల్పించడం లభించడం లేదన్నారు.సీఎం చంద్రబాబు కేవలం మాటల్లోనే ముందున్నారని,చేతల్లో ఆయన పనితనం కనిపించడం లేదన్నారు.గత జగనన్న ప్రభుత్వం 10778 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి విత్తనం నుండి పంట కొనుగోలు వరకు ప్రతి విషయంలో అండగా నిలబడ్డారన్నారు.గతంలో రంగు మారిన ధాన్యానికి కూడా మద్దతు ధర కల్పించి రైతును ఆదుకున్నారని అన్నారు.అందుకు వ్యతిరేకంగా కూటమి ప్రభుత్వంలో మంత్రులు,ఎమ్మెల్యేలు రైతుల ముఖం చాటేశారని,దళారుల రాజ్యంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు.అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని, ప్రభుత్వం పట్టించుకోకపోతే రైతుల తరపున వైసీపీ ఉద్యమిస్తుందని బొడ్డేడ ప్రసాద్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వాడ్రాపల్లి గ్రామ సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు,మూలపేట గ్రామ సర్పంచ్ భీశెట్టి గంగఅప్పలనాయుడు,తిమ్మరాజుపేట గ్రామ ఉపసర్పంచ్ కాండ్రేగుల జగన్,వైసీపీ నాయకులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

కైలాసపట్నంలో ఏరువాక పౌర్ణమి

విశాలాంధ్ర- కోటవురట్ల: జాతీయ మత్స్య పరిశోధన సంస్థ, బీసీటీ కృషి విజ్ఞాన సంస్థ, వ్యవసాయ శాఖ సంయుక్తంగా కైలాసపట్నం గ్రామంలో బుధవారం ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని చేపట్టారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా పొలంలో కొబ్బరికాయ కొట్టి, ఎడ్లకు పూజ చేసి కాడి నాగలి పూసి పొలంలో దుక్కుదున్నారు. అనంతరం వ్యవసాయ పద్ధతులను మహిళలకు వివరించారు. సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా పోషకాలతో కూడిన పంట దిగుబడి వస్తుందన్నారు. జాతీయ మత్స్య పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త వీజీ మాట్లాడుతూ చాపలు పెంపకం ద్వారా అధిక ఆదాయం పొందడమే కాకుండా చేపలను తినడం వలన ఆరోగ్యంగా ఉంటారన్నారు. బిసిటి కృషి విజ్ఞాన శాస్త్రవేత్త వి. ప్రసాద రావు మాట్లాడుతూ రైతులు వరిలో వచ్చే కొత్తరకం ఎం టి యు 1229, 1262, 1318 వంగడాలను పండించడం ద్వారా అధిక దిగుబడి సాధించగలరన్నారు యాంత్రికరణ వలన రైతులకు%శ్రీ% పెట్టుబడి తగ్గుతుందన్నారు. పెసర, కంది, గంటిజొన్న, పామాయిల్ వంటి పంటలు పండించడం ద్వారా పోషకాహార ఉత్పత్తులను పెంచగలమన్నారు. రసాయన ఎరువులకు బదులుగా నిల్వచేసిన ఆవు గేదె పేడ, గొర్రె మేకల ద్వారా లభించే గెత్త%శీ% ఉపయోగిస్తే పంటలో నాణ్యత పెరిగి అధిక దిగుబడులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో బిసిటి కృషి విజ్ఞాన యాంత్రికరణ శాస్త్రవేత్త శ్రీకాంత్ గౌడ్, తెదేపా గ్రామ శాఖ అధ్యక్షులు భీముని మాణిక్యాలరావు, స్థానిక వ్యవసాయ సహాయకులు కుమార్, రైతులు కృష్ణ, రాజబాబు, నాగేశ్వరరావు, సూర్యారావు, కన్నం నాయుడు, చామంతుల వేణు మహిళా రైతులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం మహిళా కార్మికుల బిల్లులు, వేతనాలు తక్షణమే చెల్లించాలి

విశాలాంధ్ర - చోడవరం : ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం (ఎం.డి.ఎం) మహిళా కార్మికులు వేతనాలు, బకాయి బిల్లులు తక్షణమే చెల్లించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి డిమాండ్ చేస్తున్నారు. నియోజకవర్గ స్థాయి ఎం.డి.ఎం. మహిళా కార్మికులు బుధవారం చోడవరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షురాలు వరలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు సకాలంలో బిల్లులు విడుదల చేయకపోతే విద్యార్థులకు వంట ఎలా చేసి పెట్టాలని ప్రశ్నించారు. స్కూల్ రీ ఓపెనింగ్ రోజుకి కూడా పెండింగు లో ఉన్న బిల్లులు విడుదల చేయకపోతే అప్పులు చేసి పథకాన్ని నిర్వహించలేమని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి నెల 20వ తారీకు లోపు బిల్లులు, వేతనాలు ఇచ్చే వారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి మూడు, నాలుగు నెలలు బిల్లులు రావడం లేదని ఆరోపించారు. అప్పుల ఊబిలో కార్మికులు కూరుకుపోయారని, అరువులు ఇచ్చే దుకాణ దారుల నుండి ఒత్తిడికి గురవుతున్నామని వారు ఆందోళన వ్యక్తం చేశారు. మెనూల్లో మార్పులతో మహిళా కార్మికులపై ఒత్తిడి చేస్తున్న ప్రభుత్వాలకు సకాలంలో బిల్లులు విడుదల చేయాలని కనీస ఆలోచన లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. ప్రభుత్వం తక్షణమే పెండింగ్ వేతనాలు, బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి నాయకులు ఎస్. అమ్మాజీ, బి.ఉమా, కె నాగమణి, ఓ దేవుడమ్మ, ఆర్.బుచ్చి రాజమ్మ, ఎం దేవి, వరలక్ష్మి, రాజులమ్మ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాలపై అధికారులు నిర్లక్ష్యం

విశాలాంధ్ర - కే కోటపాడు : గత వైసిపి ప్రభుత్వం లక్షలాది రూపాయలు తో నిర్మించిన రైతు సేవా కేంద్రాలు గ్రామాల్లో అలంకారప్రాయంగా మిగిలాయని , గత ప్రభుత్వం ఏ లక్ష్యంతో వాటిని ఏర్పాటు చేసిందో వాటిని అధికారులు నిర్వీర్యం చేస్తున్నారని పలువురు ఎంపీటీసీ సభ్యులు ధ్వజం ఎత్తారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాతవలస , చౌడువాడ ఎంపిటిసిలు వగ్రి రామనాయుడు , ఏటుకూరు రాజేష్ , రొంగలి సూర్యనారాయణ మాట్లాడుతూ రైతులకు అన్ని రకాల సేవలు అందించాలన్న ఉద్దేశంతో ప్రతి సచివాలయ పరిధిలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారని వాటి నిర్వహణకు వ్యవసాయ సహాయకులను ఏర్పాటు చేసి రైతులకు పలు సూచనలు సలహాలు అందించే ఏర్పాట్లు ఉండేవని అన్నారు. ప్రస్తుతం తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడ్డాక రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చి భవనాలను నిర్వీర్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఏ భవనంలో కూడా విద్యుత్ సౌకర్యం లేదని , భవనాలకు రహదారులు లేవని , భవనం లోపల చెదలు పడుతున్న ఎందుకు వాటి గురించి పట్టించుకోవడం లేదని వ్యవసాయాధికారి సోమశేఖర్ ను నిలదీశారు. భవనాలు నిర్మించిన కాంట్రాక్టర్ అన్ని సదుపాయాలు కల్పించవలసి ఉందని కొన్నింటిలో కనీసం మౌలిక సదుపాయాలు లేవని వ్యవసాయ అధికారి బదులిచ్చారు . పంచాయతీ నిధులు వెచ్చించి వాటిని వినియోగంలోకి తీసుకురావాలని సభ్యులు కోరారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ కు అన్ని రకాల ధాన్యం విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచామని వ్యవసాయ అధికారి తెలిపారు. ఈ ఏడాది నుండి విద్యార్థులకు సన్నబియ్యంతో మధ్యాహ్నం భోజనం ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంఈఓ సత్యనారాయణ తెలిపారు. విద్యార్థులకు యూనిఫాం పుస్తకాలు బ్యాగులు త్వరలో మండల కేంద్రాలకు సరఫరా అవుతాయని తెలిపారు. మండల కేంద్రంలో విద్యుత్ లైన్ ఇన్స్పెక్టర్ , లైన్మెన్ ఇతర సిబ్బంది లేకపోవడంతో విద్యుత్ అంతరాయంతో ప్రజల అవస్థలు పడుతున్నారని వెంటనే విద్యుత్ శాఖలో ఉన్న ఖాళీలు భర్తీ చేయాలని ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ విద్యుత్ అధికారులు ఆదేశించారు. ఎంపీటీసీలు సర్పంచ్ ల గౌరవ వేతనం నిధులు విడుదలకు జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి తెలియపరచాలని సభ్యులు ఎంపీడీవోను కోరారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు ఎంపీటీసీలు సర్పంచులు పాల్గొన్నారు

దివిస్, అరబిందో పరిశ్రమల వల్ల సముద్రం కాలుష్యం

విశాలాంధ్ర - పాయకరావుపేట: కాకినాడ జిల్లాలో సముద్ర తీరంలో ఏర్పాటు చేసిన దివిస్ అరబిందో కంపెనీల వ్యర్ధాల పైపులైన్లు సముద్రంలో వేయటం వల్ల సముద్ర జలాలు కలుషితమై, మత్స్యకారులకు జీవనోపాధి లేకుండా పోతుందని జాతీయ మత్స్యకార సంఘం అధ్యక్షులు మోసా అప్పలరాజు తెలిపారు. వీటిని అరికట్టాలని మత్స్యకార సంఘం ఆల్ ఇండియా సెక్రటరీ జనరల్ అనంత నగేష్ బాబుకు ఫిర్యాదు చేశారు. పరిశ్రమల వల్ల సముద్రంలో మత్స్య సంపదతో పాటు, భూగర్భ జలాలు కూడా కలుషితం అవుతున్నాయని తెలిపారు. మత్స్యకారులు సముద్రానికి దూరమై రోడ్డున పడే అవకాశం ఉందని వాపోయారు. దీనిపై స్పందించిన అనంత నగేష్ బాబు పరశ్రమలు వ్యర్థాల పైప్ లైన్ లపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని తెలిపినట్లు మోసా అప్పలరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గొల్ల ఏకాక్షరి, రాష్ట్ర కార్యదర్శి ఒరుకుల జయశంకర్, గుంటూరు జిల్లా అధ్యక్షులు మారం రవికుమార్, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు మైలి జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

మునగపాక పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ట్రైని డిఎస్పీ

విశాలాంధ్ర- మునగపాక:మునగపాకపోలీస్ స్టేషన్ ను ట్రైనీ డిఎస్పీ ఎమ్.వి.కె చైతన్య సందర్శించి స్టేషన్ లో రికార్డులు మరియు కేసు పురోగతులు అన్నీ కూడా పరిశీలించారు.అదేవిధంగా పిటిషన్లతో మాట్లాడడమైనది.ప్రభుత్వ నిబంధనలు అమలు చేయని వారిపై పోలీసులు తీసుకున్న చర్యలపై ఆరా తీశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై వి.ప్రసాదరావు కూడా వున్నారు.

రొయ్యల కంపెనీ వద్ద గుడివాడ గ్రామస్తులు ఆందోళన

విశాలాంధ్ర -యస్ .రాయవరం : మండలంలోని గుడివాడ గ్రామంలో ఉన్న సాయి మైరైన్ రొయ్యల కంపెనీ వద్ద గుడివాడ గ్రామస్తులు ఆందోళన చేపట్టారు .బుధవారం గేట్ నెంబర్ 2 వద్ద గ్రామస్తులు నిరసన తెలియజేస్తూ కంపెనీ నిర్మాణ సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని గ్రామ అభివృద్ధికి సహకరించాలని నినాదాలు చేశారు .ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై ఏ. విభూషణరావు తన సిబ్బందితో కంపెనీ వద్దకు చేరుకున్నారు. గ్రామ పెద్దలతో సమస్యను అడిగి తెలుసుకుని కంపెనీలో ఉన్న ఎండి చంద్రశేఖర్ కు తెలియజేయడం జరిగింది. దీంతో కంపెనీ యాజమాన్యం ఆహ్వానం మేరకు గ్రామానికి చెందిన పలువురు పెద్దలు చర్చలు జరపడంతో ఇచ్చిన హామీలను అమలు చేస్తామని ఎండి తెలపడం వలన ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దూళి శ్రీనుబాబు, మాజీ సర్పంచులు శ్రీపతి రాజు ,ఎన్. వెంకట్రాజు, సిపిఎం నాయకులు ఎం. అప్పలరాజు, ఎం .సత్యనారాయణ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో ఘనంగా ఉత్సవాలు

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగులలో పురాతన ఆలయంగా ప్రసిద్ధి చెందిన శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ఐదు రోజులుగా స్వామి వారి ఉత్సవాలు ఆలయ పూజారి వాడపల్లి శ్రీదేవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా బుధవారం ఉదయం వేద పండితులు అరవిల్లి గోవిందరాజు. పెద్దింటి రాంబాబు ఆధ్వర్యంలో స్వామివారి ఆలయంలో ద్వారతోరణదేవత జయాధి ప్రాయశ్చిత్త హోమం, పూర్ణాహుతి కార్యక్రమం, చక్రస్నాన మహోత్సవం నిర్వహించారు. గురువారం శ్రీవేణుగోపాల స్వామి వారికి పుష్పాంజలి సేవ, రాత్రి 7 గంటలకు మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు ఆలయ నిర్వాహకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు పుట్టా మురళీకృష్ణ, జల్ది మీనాక్షి, జాగాని లీలావతి, జాగాని పద్మ, బి.లోకేశ్వరి, వాలంకి వరలక్ష్మీ, జాగాని వెంకన్నబాబు, మహిళలు పాల్గొన్నారు.

సాగులో ఉన్న భూములకు పట్టాలు మంజూరు చేయాలి

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని కుమారపురం శివారు రత్నయ్యంపేట గ్రామంలో పూర్వీకుల నుంచి సాగులో ఉన్న భూమికి పట్టాలు మంజూరు చేయాలంటూ ఇంచార్జ్ తహసిల్దార్ గారా ఆనందరావుకు కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని సర్వే నెంబరు 218/1 లో 55 ఏళ్లుగా భూములను సాగు చేసుకుంటున్నామని తెలిపారు. ఈ విషయాన్ని హోం మంత్రి వంగలపూడి అనిత దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. కె. సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాకి నాగమణి, కాకి రమణారెడ్డి, కాకి తలుపులమ్మ, కాకి వరలక్ష్మి, పాల సత్తిబాబు రెడ్డి, పాల వెంకటరమణ, పాల అన్నారెడ్డి, పాల బాబ్జి, నీలాపు శ్యామలాదేవి తదితరులు పాల్గొన్నారు.

కొత్త పోలవరంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు

విశాలాంధ్ర -యస్ .రాయవరం : మండలంలోని గుడివాడ పంచాయతీ పరిధిలో కొత్త పోలవరం వద్ద ఒక కొండపై అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నారు .గ్రామంలోని ఎటువంటి అనుమతులు లేకుండా పగటిపూట గ్రావెల్ తవ్వకాలు జరిపి నిల్వ చేయడం జరుగుతుంది. ఈ గ్రామం రాత్రి సమయంలో గుట్టు చప్పుడు కాకుండా ట్రాక్టర్ల పై రవాణా చేయడం జరుగుతుందని పలువురు అంటున్నారు. ఎప్పటికైనా సంబంధించిన అధికారులు స్పందించి గ్రావెల్ అక్రమ రవాణాను అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

అన్న క్యాంటీన్ తహశీల్దారు కార్యాలయ అసంపూర్తి భవనాలకు పునః శంఖు స్థాపన

విశాలాంధ్ర - చోడవరం: చోడవరంలో అన్న క్యాంటీన్ రూ.50 లక్షలు వ్యయంతో నిర్మి0చనున్న నూతన భవనానికి, తహశీల్దారు కార్యలయంలో అసంపూర్తి భవనాలు నిర్మాణానికి డి.ఎం.ఎఫ్ నిధులు రూ. 1.60 లక్షలుతో పునః శంఖు స్థాపన లను ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు చేతుల మీదుగా బుధవారం చేశారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయలకు అతీతంగా ప్రజా సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. ఈ కార్య క్రమంలో అన్న క్యాంటీన్ ఇన్చార్జ్ నరసింహా రెడ్డి, తహశీల్దారు పి. రామారావు, ఎం.పి. డి.ఓ పి. ఆంజనేయులు, ఈ.ఓ. నారాయణరావు, గోవాడ సుగర్స్ మాజీ చైర్మన్ గూనూరు మల్లు నాయుడు, జనసేనాని సిరిపురపు రమేష్, టి.డి.పి. మండల అధ్యక్షుడు కనిశెట్టి మత్స్యరాజు, సకురు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర- కోటవురట్ల: మండలంలో నలుగురికి సీఎం సహాయనిధి చెక్కులను మండల తెదేపా నాయకులు బుధవారం పంపిణీ చేశారు. లింగాపురం గ్రామానికి చెందిన వరహాలబాబుకి రూ, 27960, కోటవురట్ల కు చెందిన ఫాతిమా మనీషాకు రూ, 37712, కొడవటిపూడి గ్రామానికి చెందిన నారాయణరావు కి రూ, 67038, రామన్నపాలెం గ్రామానికి చెందిన పి.రాజుకి రూ, 80499 చెక్కును అందజేశారు. సీఎం సహాయ నిధి మంజూరుకు కృషిచేసిన రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితకు ఈ సందర్భంగా లబ్ధిదారుల కుటుంబాలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షులు లింగం నాయుడు, జిల్లా తెదేపా ప్రధాన కార్యదర్శి లాలం కాశి నాయుడు, తెదేపా సీనియర్ నాయకులు జానకి శ్రీనివాసరావు, జనార్దన్, మండల తెదేపా ప్రధాన కార్యదర్శి సూర్య ప్రకాష్, మండల తెలుగు యువత అధ్యక్షులు తిరుమలరావు, జిల్లా వాణిజ్య విభాగం కార్యదర్శి సుంకర బాబ్జి, బోడపాలెం సత్యనారాయణ, ఎండపల్లి చంటి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.